క్లుప్తంగా

అందుబాటులో విత్తనాలు

దేవరకద్ర: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం పాలెంలో రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి ఆర్ఎన్ఆర్ 15038, కేఎన్ఎమ్ 1638 రకం విత్తనాలు కిలో రూ.44 (20 కిలోల బస్తాలు), వేరుశనగ కె–6, నిత్యహరిత రకం విత్తనాలు కిలో రూ.108 (30 కిలోలు), తెల్లజొన్న సీఎస్‌వీ 31, సీఎస్‌వీ 41 రకం విత్తనాలు కిలో రూ.90 (3 కిలోలు) పచ్చజొన్న పీవీపీఎస్–2 రకం విత్తనాలు కిలో రూ.150 (3 కిలోల బస్తాలు)చొప్పున విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవేగాక కంది, మినుము, ఆముదం, రాగుల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, వానాకాలం పంటలు వేసుకొనే రైతులు ముందుగానే తీసుకెళ్లాలని వివరించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



నవాబుపేట: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి పంటలను గురువారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. శాస్త్రవేత్తలు భరత్‌భూషణ్, అర్చన మండలంలోని కొల్లూర్, రుద్రారం, కేశవరావుపల్లి, యన్మన్‌గండ్లలో పర్యటించారు. పంటలు కొద్దిగా ముందుగా వేసుకుంటే వచ్చే ఫలితాలు, సమయానికి చేపట్టాల్సిన చర్యలపై పరిశీలన జరుగుతుందని.. ఉత్తమ ఫలితాలు వస్తే పంటల సాగులో కొద్ది మార్పులు జరిగే అవకాశం ఉంటుందని రైతులకు వివరించారు. పంట నష్టం పూర్తి వివరాలను జిల్లా అధికారులకు అందించనున్నట్లు వివరించారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్, సిబ్బంది శశిత, శ్వేత తదితరులు ఉన్నారు.

15న మండల సమావేశం

బాలానగర్: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15న ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కమల అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల కో–ఆప్షన్ సభ్యులతో పాటు కార్యదర్శులు విధిగా హాజరుకావాలని పేర్కొన్నారు. అన్ని శాఖల మండల అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి రావాలని కోరారు.

గార్లపహాడ్‌ను మండలం చేయాలి



కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలం చేసేందుకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని మండల సాధన సమితి కన్వీనర్ రాముమాయక్, కో–కన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. 15 గ్రామాల ప్రజల మద్దతుతో 111 రోజులుగా దీక్షలు చేస్తున్నా.. ఎమ్మెల్యేకు కనిపించకపోవడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాలానగర్: బర్రె కృష్ణయ్య మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఆయన గౌతాపూర్‌లోని కృష్ణయ్య ఇంటికి వెళ్లిమృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ వెంకటాచారి, భూపాల్, కరణం శ్రీనివాసరావు, ప్రకాష్, శివానందరెడ్డి, మండల నాయకులు ఉన్నారు.

కార్మికుడి ఆకస్మిక మృతి

బాలానగర్: పరిశ్రమల్లో పని వెదుక్కొనేందుకు వచ్చిన ఓ కార్మికుడు గురువారం ఆకస్మికంగా మృతిచెందినట్లు ఎస్ఐ జయప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మధ్యప్రదేశ్‌లోని షాడోల్ జిల్లా భరతార్‌కు చెందిన పురుషోత్తం (35) మండలంలోని మోతీఘణాపూర్ శివారులోని పరిశ్రమలో పని నిమిత్తం బావ హతిరాంసింగ్‌తో కలిసి ఈ నెల 10న వచ్చాడు. గురువారం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు తెలిపారు. హతిరాంసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ : మహిళకు గాయాలు

జడ్చర్ల: రోడ్డు దాటుతున్న మహిళను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. రోడ్డు దాటుతున్న చిట్టెమ్మను కొత్త బస్టాండ్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న కల్వకుర్తి డిపోకు చెందిన బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మహిళను 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కేసీఆర్ ముందుచూపుతోనే సస్యశ్యామలం



చైర్మన్‌తో పాటు ఎంపీ, ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

నవాబుపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తి, ముందుచూపుతోనే తెలంగాణ సస్యశ్యామలం అవుతోందని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మైసమ్మ దేవాలయ ఆవరణలో నిర్వహించిన చైర్మన్ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎడారిగా మారిన పాలమూరుకు ప్రాజెక్టులు, కాల్వలతో సాగునీటిని తీసుకొచ్చి వలసలను నియంత్రించారని వివరించారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు పనుల్లో వేగం పెంచామని.. పూర్తయితే జడ్చర్ల, పాలమూరు ప్రాంతాలు పచ్చదనంతో కళకళలాడుతాయని చెప్పారు. మైసమ్మ దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి..

మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ కృష్ణయ్య తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో చైర్మన్‌తో పాటు 13 మంది పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున వారిని సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ అధికారి మదనేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, రైతుబంధు సమితి చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, వైస్ చైర్మన్ చందర్‌నాయక్, సర్పంచ్‌లు జంగమ్మ, గోపాల్‌గౌడ్, సంజీవరెడ్డి, నర్సింహులు, మాధవులు, నరేందర్, సుభాన్‌చారి, వేణాచారి, బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి విగ్రహం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని భాగ్యేశ్వరాలయంలో గురువారం సుబ్రమణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త భార్గవశర్మ ఆధ్వర్యంలో కొనసాగిన వేడుకల్లో వేదపండితులు ఉమా మహేశ్వరశర్మ, రమేష్‌శర్మ, గోపిశర్మ, సుబ్రమణ్యేశ్వరశర్మ, ప్రభుశర్మ, రాఘవేంద్రశర్మ, చింతపల్లి కిరణ్‌శర్మ, సూర్యప్రకాశ్‌శర్మ పాల్గొని పూజలు చేశారు. మూడురోజుల పాటు హోమాలు నిర్వహించి చివరిరోజు ప్రతిష్ఠాపన పూర్తిచేసి భక్తులకు దర్శనం కల్పించారు.



ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొన్న ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కుటుంబీకులు

వీధి వ్యాపారుల తరలింపు



మహిళలతో మాట్లాడుతున్న సీఐ అశోక్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి టీడీగుట్ట రోడ్డుకు వరకు రహదారికి ఇరువైపుల కూరగాయాలు విక్రయించే వారిని గురువారం తరలించారు. ట్రాఫిక్ సీఐ అశోక్, పుర టీపీవో, ఆర్టీసీ డీఎం కలిసి వారితో మాట్లాడి పక్కనే ఉన్న గల్లీలో విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. రద్దీ అధికంగా ఉండటంతో ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని సీఐ తెలిపారు. ఇకపై కూరగాయాలను రోడ్ల పక్కన విక్రయించొద్దని హెచ్చరించారు.

క్రమబద్ధీకరణే సమస్యకు పరిష్కారం

- జేపీఎస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్



రంగుల ముగ్గులు వేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): క్రమబద్ధీకరణే సమస్యకు పరిష్కారమని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. స్థానిక ధర్నాచౌక్‌లో జేపీఎస్‌లు చేపడుతున్న నిరసన దీక్ష గురువారం 14వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా చేపట్టే విధులను వివరిస్తూ ముగ్గులు వేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విధులకు హాజరుకాకుంటే తొలగిస్తామంటూ ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని.. విధుల్లో చేరాలని మండల అధికారులు వత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. కార్యదర్శులు విధుల్లో చేరుతున్నారని అసత్య ప్రచారం చేస్తూ మనోధైర్యాన్ని దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ బెదిరింపులకు ఎట్టి పరిస్థితుల్లో లొంగమని తేల్చి చెప్పారు. డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి, బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వెంకటేశ్ చౌహాన్ పంచాయతీ కార్యదర్శులకు మద్దతు తెలిపి ప్రసంగించారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి లక్ష్మీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు పాండు, రవి, రఘుపతిరెడ్డి, నర్మద, శిరీష, రాఘవేందర్‌గౌడ్, హాజీ, వెంకట్రాములు, రాకేష్, వెంకటేశ్, మణి, సరస్వతి, శ్రీలత, పూర్ణిమ, ప్రవళిక, కృష్ణ, వేణు, జ్ఞానేశ్వర్, సింధూజ, సంతోష్, శ్రీను, చెన్నకేశవులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లిలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. గణపతి, లోకేశ్వరస్వామి, సీతారాముల విగ్రహాలతో పాటు బొడ్రాయి, కురుమూర్తి దీపస్తంభం ప్రతిష్ఠాపనలు ఉంటాయని.. రెండ్రోజుల పాటు ప్రత్యేక పూజలు, చివరిరోజు ప్రతిష్ఠాపనలు ఉంటాయని పేర్కొన్నారు.

పేదల పెళ్లికి చేయూత

నవాబుపేట: మండలంలోని పోమాల్‌లో గురువారం గ్రామానికి చెందిన చింతకింది వెంకటయ్య, పద్మమ్మ కుమార్తె కుమార్తె మమత, అదే గ్రామానికి చెందిన మరింకటి గోపాల్, యాదమ్మ కుమార్తె వసంత వివాహాలు జరిగాయి. సర్పంచ్ కృష్ణ రెండు కుటుంబాలకు పట్టువస్త్రాలు అందించారు. అలాగే బీఆర్ఎస్ యువ నాయకుడు అభిమన్యురెడ్డి రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి లక్ష్మి, నర్సింహులు, రమేష్, అర్జున్, వినయ్, అలవేలు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతబజారు రోడ్డుకు మోక్షం

బాలానగర్: మండల కేంద్రంలోని సంతబజారు రోడ్డుకు మోక్షం లభించింది. గురువారం బీటీ నిర్మాణానికిగాను కాంట్రాక్టర్ చదును చేయించారు. నిధుల సమస్య ఉన్నా.. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో ప్రజల కోరికకు రహదారి నిర్మాణం చేపడుతున్నారు. మండల కేంద్రంలోని ముఖ్యకూడలి నుంచి రైల్వే ట్రాక్, ఎన్‌హెచ్–44 వరకు బీటీ రోడ్డు నిర్మాణం జరగనుంది.



తండాలకు బీటీ రోడ్లు



నేలబండతండాకు వేసిన బీటీరోడ్డు

- రవాణా సౌకర్యం మెరుగు
- హర్షం వ్యక్తం చేస్తున్న తండావాసులు...

బాలానగర్: మండలంలోని మేడిగడ్డ, కుర్వగడ్డ, మామిడిగుట్ట తండా, నేలబండ తండా, ఏడుగుట్టల తండా, చింతకుంట, రాజ్యానాయక్, చెన్నంగులగడ్డ, మర్రిచెట్టుతండా, పోచమ్మగడ్డ తండాలకు బీటీ రోడ్ల నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. అదేవిధంగా రూప్లానాయక్ తండా, మర్రిచెట్టు తండాల రహదారులు త్వరలోనే బీటీలుగా మారనున్నాయి. అదేవిధంగా బోడగుట్టతండా, జగ్గుతండా, నామ్యాతండా, టోప్యాతండా, గుండ్యాతండాకు బీటీ మంజూరైనట్లు నాయకులు తెలిపారు.

భూముల ధరలకు రెక్కలు..

గతంలో తండాల శివారులోని భూములకు సరైన రహదారి లేకపోవడంతో ఎకరం కేవలం రూ.పది లక్షలు పలికేది. ప్రస్తుతం బీటీ రోడ్ల నిర్మాణంతో రూ.40 లక్షల నుంచి రూ. కోటికి చేరింది.

తీరిన కష్టాలు..

ఇదివరకు మండల కేంద్రం నుంచి తండాలకు చేరుకోవాలంటే అరగంట నుంచి గంట సమయం పట్టేది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్స్ రావాలన్నా చాలా సమయం పట్టేది. గర్భిణులు మధ్యలోనే కాన్పు జరిగిన ఘటనలూ ఉన్నాయి. బీటీ నిర్మాణం పూర్తి కావడంతో నిమిషాల వ్యవధిలోనే మండల కేంద్రానికి చేరుకుంటున్నారు.

తండాల అభివృద్ధికి ప్రాధాన్యం..



తండాల్లో వసతుల కల్పనకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడంతో పాటు బీటీ రోడ్లు, నీటి ట్యాంకుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

– కళ్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు, బాలానగర్

ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం..



బీటీ రోడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపడుతూ తండాలను ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దుతున్నాం. ఇందుకు సహకరిస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి గిరిజనులు రుణపడి ఉంటారు.

– వాల్యానాయక్, చైర్మన్, టీఎస్ గిరిజన కో–ఆపరేటివ్

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



వైష్ణవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: విద్యార్థులు చదువుల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేటకు చెందిన విద్యార్థిని బీసం వైష్ణవి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి పదోతరగతిలో 10 జీపీఏ సాధించగా.. గురువారం రాత్రి విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు బీసం శ్యామ్, గౌరమ్మను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైష్ణవి చదువుకు ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా వైష్ణవిని పాఠశాలలో ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, ఎంపీపీ కళావతి, రైతు బంధు సమితి అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా జమీర్, సర్పంచ్ స్వరూప, హెచ్ఎం భాస్కర్, నాయకులు లక్ష్మీనర్సింహ, కొండయ్య, మశ్చందర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్ర అదృష్టం



మక్బూల్‌పాషాను సన్మానిస్తున్న ముస్లిం సంఘాల ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర మక్కా షరీఫ్ ఉమ్రా యాత్ర చేయడం అదృష్టమని ఆల్‌పార్టీ ముస్లిం లీడర్స్ కో–ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ మోసీన్‌ఖాన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎస్ఎం ఫంక్షన్‌హాల్‌లో గురువారం కన్వీనర్ మోసీన్‌ఖాన్ ఆధ్వర్యంలో ఉమ్రా యాత్రకు వెళ్తున్న ఎదిర రెవెన్యూ వార్డుకు చెందిన జర్నలిస్టు మక్బూల్‌పాషా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం ప్రముఖులు మక్బూల్‌పాషాను పూలమాలలు, శాలువాలు, మహెరుమాళ్లతో సత్కరించారు. ఈ సందర్భంగా మోసీన్‌ఖాన్ మాట్లాడుతూ.. మక్కా, మదీనాలో దేశం, రాష్ట్రం, జిల్లా ప్రజల క్షేమం కోసం దువా చేయాలని కోరారు. ఉమ్రా యాత్ర సంపూర్ణం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహమాన్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, జామీయ మసీద్ కమిటీ అధ్యక్షుడు అహ్మద్ సనా, బీఆర్ఎస్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మక్బూల్, సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ రఫీక్ పటేల్, బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ షబ్బీర్ అహ్మద్, ఈద్గా కమిటీ కార్యదర్శి మౌలానా ఇద్రీస్‌తో పాటు ఆయా ముస్లిం సంఘాల ప్రతినిధులు మహ్మద్ ఎక్బాల్, మిర్జా ఖుద్దూస్‌బేగ్, పొన్నకల్ మహమూద్, ఫసివుల్లా బేగ్, అబ్దుల్ హక్, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

జడ్చర్ల టౌన్: కావేరమ్మపేటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం రెండోరోజు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ప్రాంతఃకాల పూజ, ఆవాహిత దేవత పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కావేరమ్మపేట వద్ద బొడ్రాయి ప్రతిష్ఠతో పాటు జడ్చర్లలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. రెండుచోట్ల హోమాలు జరిపించారు. గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల నిర్వహణపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు

మిడ్జిల్: మండలస్థాయిలో సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహణపై గురువారం ఎంపీపీ సుదర్శన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వాలీబాల్, ఖో–ఖో, కబడ్డీ పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎంపీడీఓ సాయిలక్ష్మి తెలిపారు. ప్రతి గ్రామం నుంచి ఒక జట్టు మాత్రమే పాల్గొనాలని సూచించారు. క్రీడల నిర్వహణ తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు శశిరేఖ, తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి, ఎస్ఐ రాంలాల్‌నాయక్, హెచ్ఎం రవికుమార్, పీఈటీలు పరశురాములు, రాము తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలి



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఉన్న తక్షశిల పాఠశాల విద్యార్థులు పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి చక్కటి ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు. గురువారం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాలలో సన్మానించి మాట్లాడారు. 140 మంది విద్యార్థులకుగాను 14 మంది 10 జీపీఏ, 9 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 16 మంది 9.7 జీపీఏ సాధించగా.. 99.5 శాతం ఉత్తీర్ణత నమోదైందని వివరించారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీజీఎం సుధాకర్, రాఘవేంద్ర, కో–ఆర్డినేటర్ మధుసూదన్, డీన్ యాదయ్య, సి–ఇన్‌చార్జ్ అభినయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ : వ్యక్తికి గాయాలు

ఖిల్లాఘనపురం: ఆటో, బైక్ ఎదురెదురుగా వస్తూ ప్రమాదవశాత్తు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి కాలు విరిగింది. ఈ ఘటన మండలంలోని సల్కెలాపూర్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా.. అప్పారెడ్డిపల్లికి చెందిన పట్నం నాగరాజు పని నిమిత్తం గురువారం రాత్రి సల్కెలాపురం గ్రామానికి బైక్ మీద వెళ్తున్నాడు. ఈ సమయంలో సల్కెలాపురానికి చెందిన శివ తన ఆటోలో అప్పారెడ్డి పల్లికి వస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ కొత్తగొల్ల ఊషన్న వ్యవసాయ పొలం వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో పట్నం నాగరాజు కుడి కాలు విరిగింది. చికిత్స నిమిత్తం అతడిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.



పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



పెద్దవార్వాల్‌లో క్రీడా మైదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: పేదల అభ్యున్నతే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం పల్లెబాటలో భాగంగా మండలంలోని లింగాయిపల్లి, చిన్నవార్వాల్ ,పెద్దవార్వాల్, రుసుంపల్లి, సాలార్‌నగర్, కొండారెడ్డిపల్లి, ఆశిరెడ్డిపల్లి, జంగంరెడ్డిపల్లి, గండేడ్‌లో పర్యటించి కొనుగోలు కేంద్రాలు, క్రీడా మైదానాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, భూగర్భ డ్రెయినేజీ, సీసీ రహదారుల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకే పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వారి అవసరాలు గుర్తించి అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని.. పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. చెత్త సేకరణతో పాటు భూగర్భ డ్రెయినేజీ నిర్మిస్తున్నామని.. దీంతో చెత్తాచెదారం తొలగిపోవడమేగాక రోగాల వ్యాప్తి తగ్గుతుందన్నారు. గతంలో పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు నానా తంటాలు పడేవారని.. ప్రస్తుతం ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధరలకు కొనుగోలు చేస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నిరంతర విద్యుత్, రైతుబంధు, రైతుబీమా పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రానున్న రోజుల్లో అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈశ్వరయ్య, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, సర్పంచులు లలిత, వెంకటయ్య, సత్యమ్మ, శిరీష, ప్రభాకర్‌రెడ్డి, గోపాల్, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు గోపాల్, బీఆర్ఎస్ అధ్యక్షుడు పెంట్యానాయక్, రాజ్‌కుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.